క్లుప్తంగా

అనాథకు ఆదరణ



నల్లబెల్లి : మండల కేంద్రంలో రైతు వేదిక సమీపంలో చెట్టుకింద ఉంటున్న అనాథ జన్ను సుదర్శన్‌ను స్థానిక సీఎస్ఐ చర్చి ప్రతినిధులు సోమవారం ఆదరించారు. కటింగ్, గడ్డం చేయించారు. స్నానం పోసి నూతన దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్, స్థానిక పాస్ట్రేట్ సెక్రటరీ నాగెల్లి ప్రకాశ్, మాజీ ఎంపీటీసీ జన్ను జయరావు, నాయకులు తంగెళ్ల ప్రభాకర్, కనుకం నవీన్, రాజు, సురేశ్, కుమార్, వెంకటయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

సంగెం : ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందించనున్న వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) యాకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు కేజీ ఆర్ఎన్ఆర్ 15048 రకం విత్తనానికి ధర రూ.46.66 కాగా రూ.20 సబ్సిడీ పోగా రూ.26.66, కేజీ ఎంటీయూ1010 రకం విత్తనం ధర రూ.39.80 కాగా సబ్సిడీ రూ.10 పోగా రూ.29.80 చొప్పున చెల్లించి తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లు ఏఈఓలకు ఇచ్చి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

పెన్షనర్స్ డే

సంగెం : విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు రావుల యాకయ్య నివాసంలో సోమవారం పెన్షర్స్ డే నిర్వహించారు. సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు ఇటుకాల వీరయ్య, మండల కార్యదర్శి నర్సింగరావు, కోశాధికారి రావుల కొమ్మాలు, సభ్యులు మునుకుంట్ల కొమురమ్మ, సరోజన తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్‌కుమార్

నర్సంపేట : భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) తెలంగాణ సర్కిల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా వడ్లకొండ రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన జాయింట్ సర్కిల్ నాల్గో కాన్ఫరెన్స్‌లో అనంత కేఆర్ పాల్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు.

అధ్యక్షుడిగా శ్రీనివాస్



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో ఆరె కుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజిలె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా హింగే నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా హింగే రాజేశ్వర్‌రావు, కార్యదర్శిగా అంబిరె సతీశ్, కోశాధికారిగా కైరిక రాజు, డైరెక్టర్లుగా హింగే వెంకటేశ్, శివరాజు, లోనె రాజు, హింగే రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపురం : మండలానికి చెందిన వీరమల్ల విజేందర్ కుటుంబంలోని ఒకరికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలిలా.. విజేందర్ కుటుంబం మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని వీరభద్రస్వామి ఆలయానికి వెళ్తుండగా జమాండ్లపల్లి గ్రామ శివారులోని మున్నేరువాగు సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజేందర్ తల్లి వీరలక్ష్మికి గాయాలయ్యాయి.

మహిళల సంరక్షణే కమిటీల లక్ష్యం



సంగెం : మహిళలు, బాలికల సంరక్షణే సహాయత కమిటీల లక్ష్యమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ శిక్షణ విభాగం కోఆర్డినేటర్ ఇందిర స్పష్టం చేశారు. మండల కేంద్రంలో గ్రామ మహిళ సహాయత కమిటీలకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామస్థాయిలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. తద్వారా హింస రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు రాధిక, ఆర్గనైజేషన్ సిబ్బంది తిరుమల, వనిత, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతి

సంగెం : మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కక్కెర్ల సమ్మయ్య (70) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి డీలర్ల సంఘం నాయకులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఊరంతా క్రిస్మస్ సందడి

- దశాబ్దాలుగా క్రీస్తు స్మరణలో గ్రామస్తులు
- నేటి నుంచి ఆరాధన

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ ఊరంతా క్రిస్మస్ సందడి నెలకొంది. గ్రామంలోని చర్చిలు వేడుకలకు ముస్తాబయ్యాయి. నెల రోజుల నుంచే సందడి మొదలైంది. క్రైస్తవులు యేసుక్రీస్తు సందేశాన్ని ప్రజలకు అందించే దిశగా వీధుల్లో కారెల్స్ నిర్వహించారు. పాఠశాలల్లో, ఇండ్లలో వేడుకలు నిర్వహిస్తున్నారు.

రేపటి నుంచే..

రేపటి (ఈనెల 25) నుంచే క్రైస్తవులు పూజాబలి, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. నెలరోజులపాటు కార్యక్రమాలో నిర్వహిస్తూ జీవితంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడం, నూతన జీవితాన్ని ప్రారంభించేలా ప్రార్థనలు చేస్తారు. ఇంటింటికీ వెళ్లి శుభాకాంక్షలు తెలిపి యేసుక్రీస్తు ఆశీర్వాదాలను ఫాదర్‌తోపాటు క్రైస్తవులు అందిస్తారు. క్రిస్మస్ తాత వేషాధారణతో పేదలకు బహుమతులు అందిస్తారు.

1930లో తొలిసారి..

జిల్లాలోనే పెద్దదైన తిమ్మరాయినిపహాడ్‌లో 1924లో కమ్మ కులస్తులు ఊరును స్థాపించారు. 1930 నుంచి ఫాదర్ పజలీనా చిన్న పూరి పాకలో ప్రార్థన నిర్వహించారు. 1943 నుంచి విచారణ గురువు ఫాదర్ సలోమెన్ ఎడ్ల బండిపై వచ్చి సేవ అందించారు. 1945 నుంచి 1951 వరకు ఫాదర్ గాదె రాయప్ప వస్తు సేవలు అందించారు. ఆ సమయంలోనే గ్రామస్తులు చర్చి నిర్మాణం చేపట్టారు.

స్వగ్రామానికి చేరుకుని..

నాటి బిషప్ ఆల్ఫోన్స్ బెరట్టా 1952లో గాదె రాయప్పను గ్రామ తొలి విచారణ గురువుగా నియమించారు. చర్చి కోసం ఏర్పాటు చేసిన స్థలంలో గ్రామస్తుల సహకారంతో పూరిపాకను నిర్మించి ప్రార్థనలు ప్రారంభించారు. ఏటా క్రిస్మస్ వేడుకలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆలయానికి సుమారు 1500 మందికిపైగా భక్తులు హాజరవుతారు.

క్రీస్తు పుట్టుకకు గుర్తుగా పశువుల పాక ఏర్పాటు

యెరూశలేములోని బెత్లెహేములో యేసుక్రీస్తు పశువుల పాకలో జన్మించడాన్ని గుర్తుకు తెచ్చేలా ఏటా చర్చిల ఎదుట పశువుల పాకను ఏర్పాటు చేస్తున్నారు. పాకలో మేరీమాత, చిన్నారి యేసు ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రార్థన చేస్తారు. విద్యుత్ దీపాలతో పాకను అలంకరిస్తారు.



వేడుకలకు సిద్ధమైన చర్చి

వేడుకలకు ఏర్పాట్లు



క్రీస్తు అందరి దేవుడు. ఆరాధించిన వారిని అక్కున చేర్చుకుంటాడు. గ్రామంలోని 90 శాతం ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు. ఇతర ప్రదేశాల్లో స్థిరపడిన వారు కూడా చేరుకుంటారు. వేడుకలకు ఏర్పాట్లు చేశాము.

\- తుమ్మ యాగారెడ్డి, విచారణ గురువు

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



రైతులను సన్మానిస్తున్న చైర్మన్ హరీశ్‌రెడ్డి, తదితరులు

- మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవానీ కాటన్ ఇండస్ట్రీస్‌లో పలువురు రైతులను సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ హరీశ్‌రెడ్డి మాట్లాడారు. రైతు శ్రమ ఫలితంగానే ప్రజలకు ఆహారం అందుతోందని చెప్పారు. రైతులకు లబ్ధి చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, డైరెక్టర్లు రావుల మహిపాల్‌రెడ్డి, దొడ్డ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను తరిమికొడతాం

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : అర్హులందరికీ రైతు భరోసా అందించకుండా పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం గ్రామాల్లోకి వస్తే కాంగ్రెస్ నాయకులను తరిమికొడతామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో పెట్టుబడి సాయం షెడ్యూల్ ప్రకారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాగా కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి మొండిచేయి చూపిస్తోందని మండిపడ్డారు. రైతులకు ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. సుమారు 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అంచన వేయగా ఇప్పటివరకు కేవలం 90 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. రైతులను, సహకార సంఘాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ చేపడతామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు పాలెపు రాజేశ్వర్‌రావు, ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, నానబోయిన రాజారాం, గూబ రాజు, బట్టు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ సంబురాలు

వర్ధన్నపేట/నర్సంపేట/చెన్నారావుపేట : వర్ధన్నపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట మండలాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. వర్ధన్నపేటలోని చర్చిలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేటలో ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ లాజరస్, కేక్ కట్ చేసి ప్రసంగించారు. అలాగే చెన్నారావుపేట మండలంలోని నంబర్ వన్ కాలనీలోని సెయింట్ పేతురు చర్చిలో, మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో, తిమ్మరాయినిపహాడ్‌లోని సెయింట్ థెరిస్సాస్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీఓ వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, ఎంపీఓ ధనలక్ష్మి, బ్రదర్ ఆదాం బెన్నీ, పాస్ట్రేట్ చైర్మన్ సహోదర్, పాస్టర్లు యాగారెడ్డి, రాజ్‌కుమార్, లావణ్య, వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్, పాస్ట్రేట్ సెక్రటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్ బండారి భిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజలిజమ్ కన్వీనర్ రవీందర్, డీసీసీ సభ్యుడు కందిక ప్రవీణ్, హెచ్ఎం ఆరోగ్య శౌరీ, కరస్పాండెంట్ అన్నా మేరీ, సైమన్ పీటర్, క్రాంతి పాల్, రేజీ జార్జ్, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న కమిటీ బాధ్యులు



చెన్నారావుపేట : ప్రభుత్వపాఠశాలలో..

ఆర్థిక అక్షరాస్యతతో సామాజిక అభివృద్ధి

- ఎంపీడీఓ శ్రీవాణి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

చెన్నారావుపేట : ఆర్థిక అక్షరాస్యతతో ప్రజలు సామాజికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీఓ శ్రీవాణి ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని జల్లిలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపాదించిన దాంట్లో కొంత డబ్బును ప్రతినెలా పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలపై చైతన్యవంతం కావాలని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంకు కౌన్సిలర్ భాస్కరచారి మాట్లాడుతూ పేదల కోసం బ్యాంకులు సామాజిక భద్రత పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, తదితర పథకాలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కి సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వీరన్న, సీసీ మంజుల, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ గణేశ్, ధరణి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఈదునూరి రమేశ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ముబీన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



నల్లబెల్లి : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అన్నాదేవి, నాయకులు

- యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి

నల్లబెల్లి/సంగెం/ఖానాపురం : ఈనెల 28, 29, 30వ తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆరో విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి, జిల్లా కార్యదర్శి సుజన్ ప్రసాద్‌రావు, ఖానాపురం మండల అధ్యక్షుడు వేములపల్లి రామ్మోహన్‌రావు కోరారు. నల్లబెల్లి, సంగెం, ఖానాపురం మండల కేంద్రాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లలో మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నాదేవి, సుజన్‌ప్రసాద్‌రావు, రామ్మోహన్‌రావు మాట్లాడారు. మహాసభలకు ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా కోశాధికారి సయ్యద్ అబ్దుల్ రవూఫ్, ఎంఈఓ రాము, మండల అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి కిశోర్ కుమార్, నాయకులు బుచ్చన్న, హేము, కొముర‌య్య, వసీం సుల్తానా, జ్యోతి, శోభారాణి, సాబిర్, చలం, శివప్రసాద్, రాంసింగ్, యాదగిరి, కుమార్, హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు మల్లయ్య, రవీందర్, నాయుడు, రవికుమార్, శ్రీనివాస్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలి



సంగెం : మండలంలోని తీగరాజుపల్లి గ్రామ కంఠం భూములను కబ్జాదారుల బారి నుంచి కాపాడాలని గ్రామ ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శోభకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ కన్వీనర్ కర్నుగుత్త గోపాల్ మాట్లాడారు. గ్రామంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని సర్వే నంబర్ 563లోని సుమారు రూ.2 కోట్ల విలువైన 10 గుంటల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు కబ్జాచేసి అమ్ముకున్నారని చెప్పారు. గతంలో అధికారులు సర్వే చేసి భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించి కబ్జాదారులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కందికొండ వెంకన్న, నాగమురళి, రాములు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

- ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్

వర్ధన్నపేట: ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలంలోని ఇల్లంద గ్రామంలో నిర్వహించే సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దామెర విజయకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో సాంస్కృతిక శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక రంగంలో తనదైన శైలిలో ప్రజానాట్యమండలి ఒక మలుపు తీసుకువచ్చిందన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థుల సమస్యలపై వేలాది పాటలు పాడినట్లు తెలిపారు. వివిధ కళారూపాల ద్వారా రాష్ట్రంలోని వృద్ధ కళాకారులకు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డుల కోసం అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ఫలితాలు సాధించిందన్నారు. యువతలో కళలను వెలికి తీసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాకారులు ఆర్థికంగా సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల సుప్రియ, చిన్న యాదగిరి, వసంత, శాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందగా బాధిత కుటుంబానికి పూర్వవిద్యార్థులు సోమవారం రూ.లక్ష సాయం అందజేశారు. వివరాలిలా.. మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఉపాధ్యాయుడు జక్కుల జగదీశ్వర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో అదే స్కూల్‌లో 2007లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బాధిత కుటుంబానికి సాయం అందజేశారు. తొలుత జగదీశ్వర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముకుంద్, కార్తీక్, వంశీ, మొగిళి, అన్వేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



పర్వతగిరి : విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ఉపాధ్యాయులు



గీసుకొండ : విద్యార్థులతో ప్రిన్సిపాల్

పర్వతగిరి : మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ విద్యార్థులు సందీప్, బిందు, చరణ్‌తేజ, నవ్య, నిషా జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతోపాటు పీఈటీలు రాజు, వేణులను కరస్పాండెంట్ శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్‌తోపాటు ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడారు. విద్యార్థులు ఈనెల 27న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపప్రధానోపాధ్యాయుడు మహేందర్, కోఆర్డినేటర్ అనిల్, సంతోశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం నుంచి ఇద్దరు..

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు మాటేటి పవన్, జూలూరి శరత్ జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కబడ్డీ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 నుంచి మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పవన్, శరత్ జిల్లా జట్టు తరపున పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు పుప్పాల ఎల్లయ్య అభినందించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు..

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు నాగేశ్వరి, రాజేశ్వరి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాస్, వార్డెన్ వీరమ్మ తెలిపారు. విద్యార్థినులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ దేవీలాల్‌ను హెచ్ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్ఎం, వార్డెన్ మాట్లాడారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి..

గీసుకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉమామహేశ్వరి, రవళి, తరుణి, వంశీ, ధర్మతేజ, చరణ్, రోణిక్, సుజిత్ ప్రసాద్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.అశోక్‌రావు తెలిపారు. సదరు విద్యార్థులను కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించి మాట్లాడారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వినియోగదారుల హక్కుల రక్షణే ధ్యేయం

- మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రతన్‌సింగ్

నర్సంపేట : వినియోగదారుల హక్కుల రక్షణే ధ్యేయంగా వినియోగదారుల సంఘాలు పని చేస్తున్నాయని వినియోగదారుల మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ రతన్‌సింగ్ తెలిపారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, గిరిజన బాలికల వసతి గృహంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసే వస్తువుల్లో కల్తీ, నకిలీ చోటు చేసుకుంటే వినియోగదారుల చట్టం రక్షణ కల్పిస్తుందని చెప్పారు. వస్తువుల కొనుగోలు సందర్భంగా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. తద్వారా జరిగిన నష్టానికి, మోసానికి కోర్టులో ఎలాంటి ఖర్చు లేకుండా 90 రోజుల్లో పరిహారం పొందవచ్చని తెలిపారు. మండలి జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ మాట్లాడుతూ వినియోగదారులు మోసాలు, అసౌకర్యాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 18004250033కు ఫోన్ చేసి సమాచారం అందించి న్యాయం పొందాలని సూచించారు. అనంతరం వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ సారంగం, మండలి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిగా పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివి

రాయపర్తి : దేశ ప్రధానిగా పీవీ నర్సింహారావు అందించిన సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి కొనియాడారు. పీవీ నర్సింహారావు వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. పీవీ చేపట్టిన సంస్కరణలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేశ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో నైపుణ్యం

వర్ధన్నపేట : నిత్యనూతన ఆవిష్కరణలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య తెలిపారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పోచయ్య మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, బాల్యంలో సాధించిన ఘనతలను, సమస్య పరిష్కారాలను కొనుగొనే విధానాన్ని వివరించారు. రామానుజన్ సెంటర్ వివరణలను వివరించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆవిష్కరణల పట్ల మొగ్గు చూపాలని సూచించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి మాధవి మాట్లాడుతూ ప్రతిఒక్కరి దైనందిన జీవితం గణితంతో ముడిపడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, ఐపీఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ రజిత, డాక్టర్ స్నేహలత, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.